క్లుప్తంగా

53 పశువులకు వైద్యపరీక్షలు



పరీక్షలు నిర్వహిస్తున్న చిట్టినాయుడు

మాడుగుల: స్థానిక చిన్న కర్రి వారి కళ్లాల వద్ద శుక్రవారం వైఎస్సార్ సంచార పశువైద్యసేవా వాహనం ద్వారా మాడుగుల పశువైద్యశాల సిబ్బంది పశువైద్య శిబిరం నిర్వహించారు. 53 పశువులకు వైద్యపరీక్షలు జరిపి, ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సహాయ సంచాలకులు వి.చిట్టినాయుడు, పశువైద్యాధికారి లక్ష్మణ్, 1962 అంబులెన్స్ పశువైద్యాధికారి శైలేంద్ర, వెటర్నరీ అసిస్టెంట్ సౌజన్య, ల్యాబ్ టెక్నీషియన్ కుమారి పాల్గొన్నారు.

పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలి



పుస్తక పఠనం కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న సౌమ్య

కె.కోటపాడు : విద్యార్థి దశ నుంచే పుస్తక పఠనాన్ని అలవాటుగా చేసుకోవాలని కె.కోటపాడుశాఖా గ్రంథాలయ అధికారి సౌమ్య తెలిపారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా శుక్రవారం విద్యార్థులకు పుస్తక పఠనం, స్టోరీ టెల్లింగ్ కార్యక్రమాలను నిర్వహించారు.అనంతరం వారితో చెస్ ఆడించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విజేతలకు వచ్చేనెల 11న బహుమతులను అందజేయనున్నట్లు తెలిపారు.

పుచ్చలపల్లి సుందరయ్యకు ఘన నివాళి



సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నర్సింహమూర్తి

మాడుగుల రూరల్: కమ్యూనిస్టు ఉద్యమ నేత పుచ్చలపల్లి సుందరయ్య 38వ వర్ధంతి సందర్భంగా అవురువాడ పంచాయతీ చినగొర్రెగెడ్డలో శుక్రవారం పలువురు ఘనంగా నివాళి అర్పించారు. గిరిజన సంఘం ఐదవ షెడ్యూల్ సాధన కమిటీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇ.నర్సింహమూర్తి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకురాలు కె.భవానీ సారధ్యంలో పలువురు ఉపాధి కూలీలు సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళిఅర్పించారు.

చింతపాకలో సంపద తయారీ కేంద్రం ప్రారంభం



సంపద తయారీ కేంద్రంలో ఎర్రలు వదిలి ప్రారంభిస్తున్న సర్పంచ్,సెక్రటరీ

బుచ్చెయ్యపేట: మండలంలోని చింతపాక గ్రామంలో ఏర్పాటు చేసిన వర్మీ కంపోస్టు యూనిట్(సంపద తయారీ కేంద్రం)ను సర్పంచ్ గొలజాన శ్రీను శుక్రవారం ప్రారంభించారు. ఇటీవల జిల్లా పంచాయతీ అధికారి శిరీషారాణి,తహసీల్దార్ అంబేడ్కర్,ఎంపీడీవో సువర్ణరాజు తదితరులు గ్రామాన్ని సందర్శించి, సంపద తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. దీంతో సర్పంచ్ ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ప్రారంభ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

నేడు వలంటీర్లకు సత్కారం

రోలుగుంట: సేవా వజ్ర, సేవారత్న, సేవా మిత్ర అవార్డులకు ఎంపికైన వలంటీర్లకు మండలకేంద్రం రోలుగుంటలో శనివారం సాయంత్రం ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ సత్కరిస్తారని ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమం అనంతరం కొండపాలెం పంచాయతీ శివారు వెలంకాయలపాలెంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. ఈ నెల 22న కొండపాలెంలో ఉదయం 6 గంటల నుంచి గడపగడపకు మన ప్రభుత్వం జరుగుతుందని తెలిపారు.

అభివృద్ధి పథంలో కంచుగుమల

- అన్ని వీధుల్లో సీసీ రోడ్లు
- స్థలం లేనివారికి సామూహిక మరుగుదొడ్లు



సామూహిక మరుగుదొడ్లు



చెత్త సంపద తయారీ కేంద్రం

రోలుగుంట: రెండేళ్ల క్రితం వరకూ సాధారణంగా ఉండే కంచుగుమల పంచాయతీ ఇప్పుడు అభివృద్ధి పథంలో పయనిస్తోంది. మరుగుదొడ్లు, సీసీ రోడ్లు తదితర మౌలిక సదుపాయాలు కల్పించేందుకు సర్పంచ్ బండారు శ్రీనివాసరావు, ఎంపీటీసీ వద్దాది సతీష్ కృషి చేశారు. వివిధ పనులు కోసం వచ్చే వారు కూర్చుకునేందుకు వీలుగా పంచాయతీ భవనం ఆవరణలో సిమెంటుతో బల్లలు ఏర్పాటు చేశారు. ఆహ్లాదకర వాతావరణం కల్పించే విధంగా మొక్కలు నాటించారు. పంచాయతీలోని సంపద తయారీ కేంద్రం మండలంలోనే ఆదర్శంగా ఉంది. ఎనిమిది వార్డులు గల ఈ పంచాయతీలో 1354 మంది జనాభా ఉన్నారు. ఎన్ఆర్ఈజీఎస్ పథకం ద్వారా మంజూరైన మ్యాచింగ్ గ్రాంట్‌తో అన్ని వీధుల్లో సీసీరోడ్లు నిర్మించారు. పక్కా ఇళ్లు ఉండి మరుగు దొడ్లు నిర్మించేందుకు స్థలం లేని వారిని గుర్తించి ప్రభుత్వం స్థలం సేకరించివారందరికీ సామూహిక మరుగు దొడ్లు నిర్మించారు. వాటర్ ట్యాంకు ఏర్పాటు చేసి, మరుగుదొడ్లలోకి నీటి సరఫరా సౌకర్యం కల్పించారు. శతశాతం స్వచ్ఛభారత్ పాటిస్తూ పలు గ్రామాలకు ఆదర్శంగా ఉండే విధంగా పాలక వర్గం కృషి చేస్తోంది. ఎప్పటి నుంచో నిర్మాణానికి నోచుకోని బీసీ, ఎస్సీ సామాజిక భవనాల గురించి సర్పంచ్, ఎంపీటీసీలు ఎమ్మెల్యే ధర్మశ్రీ దృష్టికి తీసుకువెళ్లడంతో బీసీ సామాజిక భవనానికి రూ.5 లక్షలు మంజూరు కాగా, ఆ నిధులతో నిర్మాణం పూర్తి చేశారు. గడప గడపకూ మన ప్రభుత్వం నిధుల నుంచి మంజూరు చేసిన రూ.5 లక్షలతో ఎస్సీ సామాజిక భనం నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

ప్రజల సహకారంతో మరింత అభివృద్ధి



గ్రామస్తుల సహకారంతో గ్రామాన్ని మరింతగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నాం. గ్రామంలో ప్రజలంతా ఒకే మాటమీద ఉండేలా అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. వార్డు మెంబర్లు, ప్రజలు అందిస్తున్న సంపూర్ణ సహకారం అభివృద్ధికి దోహదపడుతోంది.

– బండారు శ్రీనివాసరావు, సర్పంచ్

అందరి సహకారంతో..



ప్రజల అవసరాలు గుర్తించి వాటిని నెరవేర్చేందుకు, సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. అన్ని వర్గాల ప్రజలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, అధికారులు అభివృద్ధికి సహకరిస్తున్నారు.

– వద్దాది సతీష్, ఎంపీటీసీ సభ్యుడు, అడ్డసరం సెగ్మెంటు

వలంటీర్లే ప్రభుత్వానికి వెన్నెముక

- ఉత్తమ సేవకులకు పురస్కారాలందించిన ప్రభుత్వవిప్ కరణం ధర్మశ్రీ



వలంటీర్లను సత్కరించి పురస్కారాలు అందజేస్తున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



సేవా వజ్ర అవార్డును పొందిన సాయికుమార్‌ను సత్కరిస్తున్న కరణం ధర్మశ్రీ

చోడవరం: గ్రామ వలంటీర్లే ప్రభుత్వానికి వెన్నెముక అని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయం ఆవరణంలో గ్రామ వలంటీర్లకు శుక్రవారం పురస్కారాలను అందజేశారు. సేవా వజ్ర, సేవా రత్నా, సేవా మిత్ర అవార్డులతో సత్కరించారు. చోడవరం మండలంలో 412మంది వలంటీర్లు ఉండగా నియోజకవర్గస్థాయిలో దుడ్డుపాలెం సచివాలయం పరిధిలోని పొన్నగంటి సాయికుమార్‌కు సేవా వజ్ర అవార్డు దక్కింది. ఆయనను దుశ్శాలువాతో సత్కరించడంతోపాటు ప్రభుత్వం అందజేసిన రూ. 30వేల చెక్కును అందజేశారు. వలంటీర్లు బొర్రా సంతోష్, గుళ్ల శివలక్ష్మి, డొక్కరి చినవెంకట అప్పారావు, జి.సాయికుమార్, పొంగలి పావనిలకు సేవా రత్న అవార్డులతో సత్కరించారు. వీరితోపాటు 324మంది వలంటీర్లకు సేవామిత్ర అవార్డులు లభించాయి. వలంటీర్లకు వందనం కార్యక్రమంలో మొదటి రోజు చోడవరం మండలంలో ఆరు సచివాలయాల పరిధిలో సేవారత్న అవార్డుల గ్రహీతలను సత్కరించారు.వలంటీర్లకు దుశ్శాలువాలు కప్పి ప్రశంసాపత్రాలు, సేవా మిత్ర గుర్తింపు ట్యాగ్‌లు అందజేశారు. ఈ సందర్భంగా ధర్మశ్రీ మాట్లాడుతూ గత ప్రభుత్వాల హయాంలో పథకాలు ప్రజలకు సక్రమంగా చేరేవికావని, ప్రభుత్వం నుంచి వచ్చే ఏ పథకమైనా నేరుగా ప్రజలకే అందించాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల కోసమే ఈ వలంటీర్ల, సచివాలయ వ్యవస్థను తెచ్చారన్నారు. ప్రభుత్వ పథకాలు నేరుగా లబ్ధిదారులకు అందజేసిన ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమని ఆయన అన్నారు. రానున్న రోజుల్లో వలంటీర్లు మరింతగా ప్రజా సేవ చేయడంతోపాటు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి చైతన్య, ఎంపీపీ గాడి కాసు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక సత్యారావు, సర్పంచ్‌లు నాగులాపల్లి రాంబాబు, కూర్మదాసు మాలిబాబు, పోతల జానకీప్రసాద్, కోన చంద్రరావు, నాగబాబు, బైన ఈశ్వరరావు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఓరుగంటి నెహ్రూ పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు మంజూరు

- ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ
- అంకుపాలెంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం



గోవిందమ్మకాలనీలో మహిళలతో మాట్లాడతున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

చోడవరం: అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు మంజూరు చేస్తున్నట్లు ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ తెలిపారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా అంకుపాలెం పంచాయతీలో గోవిందమ్మ కాలనీలో శుక్రవారం ఆయన పర్యటించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి ఇంటింటికీ వెళ్లి ఆరా తీశారు. వివిధ కారణాలతో పింఛన్లు రానివారు కొందరు తమ సమస్యను తెలియజేయడంతో త్వరలో వారికి పింఛన్లు మంజూరయ్యేలా చూస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం నుంచి తాము పొందుతున్న పథకాలు, ఆర్థిక భరోసాపై మహిళలు, స్థానిక ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. స్థానిక సమస్యలను గ్రామ సర్పంచ్ నాగులాపల్లి రాంబాబు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ప్రధానంగా గోవిందమ్మ కాలనీలో డ్రైనేజీలు లేక ఇబ్బంది పడుతున్నట్టు స్థానికులు చెప్పడంతో వాటిని నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గాడి కాసు, తహసీల్దార్ తిరుమలరావు, ఎంపీడీవో చైతన్య, పంచాయతీ రాజ్ డీఈఈ ప్రసాద్, వైస్ ఎంపీపీలు బైన ఈశ్వరరావు, బుద్దగంగరాజు, ఎంపీటీసీ కోన అనురాధ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సేవా అవార్డులకు 197 మంది వలంటీర్ల ఎంపిక

రోలుగుంట: సేవా అవార్డు లకు మండలం నుంచి 197 మంది వలంటీర్లు ఎంపికైనట్లు ఎంపీడీవో కె.ప్రభాకర్రావు తెలిపారు. వీరిలో సేవా వజ్రకు ఇద్దరు, సేవారత్న అవార్డుకు ఐదుగురు, మిగిలిన వారు సేవా మిత్ర అవార్డుకు ఎంపికయ్యారన్నారు. సేవా వజ్ర అవార్డుకు ఎంపికైన ఏసుకుమార్‌కు ప్రభుత్వం ప్రకటించిన రూ.30 వేల నగదు, ప్రశంసా పత్రం అందజేసి, సత్కరించనున్నట్లు ఎంపీడీవో తెలిపారు.

పంచాయతీల అభివృద్ధికి కృషి

ఎంపీపీ శ్రీనివాసరావు



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

రోలుగుంట: మండలంలోని అన్ని పంచాయతీల అభివృద్ధికి కృషి చేస్తున్నట్టు ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకున్నట్టు చెప్పారు. నీటి ఎద్దడి నివారణకు తీసుకోవలసిన చర్యల గురించి ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాజుతో ఎప్పటికప్పుడు చర్చిస్తున్నట్టు తెలిపారు. మండల పరిషత్ నిధులతో గ్రామాల్లో 48 బోర్లు వేయించినట్టు చెప్పారు. గ్రామాల్లో అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనపై స్థానిక చర్చించి ప్రాధాన్యతా క్రమంలో నిధుల మంజూరు కోసం ఎమ్మెల్యే ,ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీని కోరినట్టు ఆయన తెలిపారు.

బీఎన్ రోడ్డులో ఆక్రమణల తొలగింపునకు మార్కింగ్

స్వచ్ఛందంగా తొలగించుకోవాలని అధికారుల విజ్ఞప్తి



మార్కింగ్ చేస్తున్న అధికారులు, సిబ్బంది

రావికమతం: స్థానిక బీఎన్ రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణల తొలగింపునకు అధికారులు శుక్రవారం మార్కింగ్ చేశారు. ఆక్రమణదారులు స్వచ్ఛందంగా ఆక్రమణలు తొలగించి తమకు సహకరించాలని వారు కోరారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మహేశ్వరరావు, ఆర్‌అండ్‌బీ డీఈ కె.ఎస్.ప్రభు మాట్లాడుతూ బ్రిటీష్ కాలంలోనే దీనిని వంద అడుగుల రోడ్డుగా ఏర్పాటు చేశారని తెలిపారు. రోడ్డుకు ఇరువైపు 60 నుంచి 100 అడుగుల స్థలాన్ని ఆక్రమించి బడ్డీలు, షాపులు ఏర్పాటుచేశారని చెప్పారు. దుకాణదారులు రహదారికిరువైపులా ఉన్న కాలువలను సైతం ఆక్రమించి 20 అడుగుల మేర రోడ్డుపైకి వచ్చేశారని వారు చెప్పారు. కాలువలు పూడుకుపోవడం వల్ల మురుగునీరంతా రోడ్డుపై ప్రవహిస్తూ దుర్గంధం వెదజల్లడంతో పాటు ప్రమాదాలకు కారణమవుతోందన్నారు. ఆక్రమణల తొలగింపునకు మార్కింగ్ పూర్తయిందని, తక్షణం ఆక్రమణదారులు స్వచ్ఛందంగా తొలగిపోయి తమకు సహకరించాలని కోరారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో వెంకన్నబాబు, మండల సర్వేయర్ సత్యనారాయణ,ఆర్‌అండ్‌బీ జేఈసాయి శ్రీనివాస్,ఆర్ఐ సతీష్,పంచాయతీ కార్యదర్శి సత్యారావు, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఉపాధి పనుల ప్రాంతంలో చలివేంద్రం



చలివేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడుతున్న సర్పంచ్, ఎంపీటీసీ

కె.కోటపాడు : ఉపాధి పనులకు హాజరవుతున్న వేతనదారులకు పనుల కల్పనతో పాటు వారి ఆరోగ్య భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం తగినచర్యలు తీసుకుంటోందని సూదివలస సర్పంచ్ ఆదిరెడ్డి సన్యాసినాయుడు, ఎంపీటీసీ వర్రి రామునాయుడు తెలిపారు. సూదివలసలో ఉపాధి పనులు జరుగుతున్న ప్రాంతం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శుక్రవారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉదయాన్నే పనులకు హాజరై, ఎండ తీవ్రత పెరగకముందే పనులను ముగించుకుని ఇళ్లకు వెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వీఆర్పీ సాయి, కిలపర్తి సత్యంనాయుడు, కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో డ్రైడే

మాడుగుల రూరల్: దోమలు వృద్ధి చెందకుండా ప్రతి ఒక్కరూ తగిన జాగ్రతలు తీసుకోవాలని కె.జె.పురం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కె.లీలాప్రసాదు తెలిపారు. డ్రైడే సందర్భంగా తాటిపర్తి, కాశీపురం గ్రామాల్లో సిబ్బందితో కలిసి ఇంటింటికీ వెళ్లి పరిశీలించారు. నీరు నిల్వ ఉండకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎం. కోటపాడు, వల్లాపురం, కె.జె.పురం, వీరనారాయణం తదితర గ్రామాల్లో వైద్య సిబ్బంది, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో మెరుగైన వైద్యం

కె.కోటపాడు: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో గ్రామీణ ప్రాంత ప్రజలకు సకాలంలో మెరుగైన వైద్యం అందుతోందని చౌడువాడ పీహెచ్‌సీ వైద్యాధికారి నిర్మల తెలిపారు. పైడంపేటలో శుక్రవారం నిర్వహించిన ఫ్యామిలీ డాకర్ కార్యక్రమంలో 113 మందికి ఆమె వైద్య పరీక్షలు జరిపారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న తొమ్మిది మంది ఇళ్లకు వెళ్లి వైద్యసేవలందించారు. ఎంపీహెచ్ఈవో కె.వి.రాజశేఖర్, హెల్త్ అసిస్టెంట్ డి.ఎస్.ఎన్.రాజు పాల్గొన్నారు.

మాడుగుల రూరల్: తాటిపర్తి పంచాయతీ శివారు కాశీపురంలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. కేజేపురం వైద్యాధికారి డాక్టర్ కె.లీలాప్రసాద్ గ్రామంలో 70 మందిని పరీక్షించారు. దీర్ఘకాలిక రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. వేసవిలో తీసుకోవలసిన ఆరోగ్య జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు వెంకటరావు, హెచ్‌వి శ్రావణి, ఆరోగ్య సహాయకులు కిల్లో నీలాంబరం, ఏఎన్ఎం సువరణకుమారి, మాజీ సర్పంచ్ అల్లంగి సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల సందర్శన



చిన్నారుల సామర్థ్యాన్ని తెలుసుకుంటున్న సూపర్‌వైజర్ సత్యవతి

రోలుగుంట: అంగన్‌వాడీ కేంద్రాలకు వస్తున్న చిన్నారులకు అక్షరజ్ఞానం కల్పించే విధంగా అంగన్‌వాడీ వర్కర్లు విధులు నిర్వహించాలని ఐసీడీఎస్ రోలుగుంట సెక్టార్ సూపర్‌వైజర్ పెట్ల సత్యవతి తెలిపారు. స్థానిక ఎంపీపీ పాఠశాలలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ 2,3,4,5 సెంటర్లను శుక్రవారం ఆమె సందర్శించారు. ముందుగా కేంద్రాలకు వచ్చిన చిన్నారుల హాజరును పరిశీలించారు. కేంద్రాలకు వస్తున్న చిన్నారులు నేర్చుకుంటున్న అక్షరాలు, బొమ్మల చార్టుపై వారికున్న అవగాహనను తెలుసుకున్నారు.

అందరిపైన ప్రభుత్వ భూముల పరిరక్షణ బాధ్యత

దేవరాపల్లి: ప్రభుత్వ భూములు, ఆస్తులను పరిరక్షించాల్సిన బాధ్యత అందరికీ ఉందని స్థానిక తహసీల్దార్ ఎం.లక్ష్మి అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురైతే తన దృష్టికి తీసుకువస్తే సమగ్ర దర్యాప్తు చేసి, తగు చర్యలు తీసుకుంటానని చెప్పారు. సమగ్ర భూ రీ సర్వేలో భాగంగా ప్రభుత్వ భూములను గుర్తించి సర్వే రాళ్లను పాతిస్తున్నామన్నారు.

వేసవి దుక్కులతో అధిక ప్రయోజనం

బుచ్చెయ్యపేట: వేసవి కాలంలో లోతు దుక్కుల వల్ల అధిక ప్రయోజనాలు పొందవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం(కేవికే) ప్రధాన శాస్త్రవేత్త ఎస్.రాజ్ కుమార్ తెలిపారు. శుక్రవారం రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కేవీకే శాస్త్రవేత్తలు వేసవి కాలం లోతు దుక్కులు,భూసార పరీక్షల ఆవశ్యకతపై ఫోన్‌కాల్ పోగ్రాం నిర్వహించారు. పలు గ్రామాల నుంచి ఫోన్ ద్వారా సమస్యలు తెలిపిన రైతులకు శాస్త్రవేత్తలు సమాధానాలు తెలిపారు. పంట అధిక దిగుబడులు,విత్తనాల ఎంపిక,యాంత్రీకరణ తదితర రైతుల సమస్యలకు ఫోన్‌లైవ్ పోగ్రాం ద్వారా సమాధానాలు చెప్పారు. ఇంజినీర్ బాబు,ల్యాబ్ టెక్నీషియన్ స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

రూ.23.43 కోట్లతో 20 తారురోడ్లు



డికాడ-శిరిజాం గదబూరు రోడ్డును పరిశీలిస్తున్న ఎంపీపీ జయమ్మ, వైఎస్సార్‌సీపీ నేతలు

చీడికాడ: డిప్యూటీ సీఎం సహకారంతో చీడికాడ మండలంలో రూ.23.43 కోట్లతో 20 రహదారులు తారు రోడ్లుగా మారుతున్నాయని ఎంపీపీ కురచా జయమ్మనారాయణమూర్తి తెలిపారు. చీడికాడ-శిరిజాం తారురోడ్డును మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నేతలు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీపీ విలేకరులతో మాట్లాడారు. మండలంలోని ప్రతి గ్రామంలో పర్యటించిన డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ఆయా గ్రామాల మధ్య లింకురోడ్లను తారురోడ్లుగా మార్చారని చెప్పారు. దశాబ్దాలుగా మరమ్మతులకు నోచుకోక శిథిలమైన తారురోడ్లను తిరిగి నూతనంగా నిర్మించారని చెప్పారు. ఇప్పటికే 10 తారురోడ్లు పూర్తికాగా, మరో ఆరు రోడ్లు నిర్మాణంలో ఉన్నాయని తెలిపారు. నాలుగు రోడ్లు నిర్మాణాలు ప్రారంభించాల్సి ఉందన్నారు. నిర్మాణం పూర్తి చేసిన రోడ్లు అందుబాటులోకి వచ్చాయని చెప్పారు. ఆయా గ్రామాల ప్రజల తరఫున సీఎం జగన్‌మోహన్‌రెడ్డి,డిప్యూటీ సీఎంబూడి ముత్యాలనాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మండలపార్టీ అధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు,పార్టీ జిల్లా రైతువిభాగం అధ్యక్షుడు యర్రా అప్పారావు, డెయిరీ డైరెక్టర్ శీరంరెడ్డి సూర్యనారాయణ,సచివాలయాల మండల కన్వీనర్ ఈర్లె చైతన్య,చీడికాడ గ్రామశాఖ అధ్యక్షుడు పరువాడ మహేష్,చీడికాడ పాలసంఘం అధ్యక్షుడు పరవాడ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

దేవరాపల్లిలో మెగా వైద్య శిబిరం రేపు

దేవరాపల్లి: స్థానిక రామాలయం వద్ద ఆదివారం మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. వెంకటేశ్వర మెడికల్ సెంటర్, మండల ఆదర్శ వినియోగదారుల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే ఈ వైద్యశిబిరాన్ని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు ప్రారంభిస్తారన్నారు. పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రభుత్వ పాఠశాలలతో మంచి భవిష్యత్తు



టెన్త్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను సత్కరించిన హెచ్ఎం స్వర్ణలత

దేవరాపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభ్యాసం చేసిన విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎ.కొత్తపల్లి హైస్కూల్ హెచ్ఎం వై.స్వర్ణలత అన్నారు. ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌లో భాగంగా గ్రామంలో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎ.కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులను చేర్పించాలని ఆమె కోరారు.

టెన్త్ ఫలితాల్లో సాధించిన ఉత్తీర్ణత, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కల్పిస్తున్న సదుపాయాలను గ్రామస్తులకు వివరించారు. అనంతరం స్థానిక హైస్కూల్‌లో టెన్త్‌లో అత్యధిక మార్కులు సాధించిన జి.షర్మిల, ఎల్.వరలక్ష్మి జి. హరీష్, బి. జ్యోతి, డి.దాలినాయుడులను గ్రామస్తుల సమక్షంలో స్థానిక హెచ్ఎం ఘనంగా సత్కరించి, ప్రశంసా పత్రాలను అందజేశారు.

'జగనన్నకు చెబుదాం'పై ఆర్డీవో సమీక్ష



అధికారులతో సమీక్షిస్తున్న ఆర్డీవో జయరాం

నర్సీపట్నం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్నకు చెబుదాం కార్యక్రమంపై అధికారులతో ఆర్డీవో హెచ్.వి.జయరాం శక్రవారం తన కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. స్పందనలో వచ్చిన 22 ఫిర్యాదుల పరిష్కారంపై ఆయా శాఖల అధికారులను ఆరా తీశారు. ప్రజలకు జవాబుదారీగా ఉండేందుకు ప్రభుత్వం జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని చేపట్టిందని ఆర్డీవో తెలిపారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలను క్లియర్ చేయాలని ఆర్డీవో సూచించారు. సమీక్షలో డివిజన్‌లోని తహసీల్దార్లు, ఎంపీడీవోలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎండలు తగ్గే వరకూ అప్రమత్తం

నాతవరం: ఎండల తీవ్రత తగ్గే వరకూ ఉపాధి కూలీలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో లోకుల యాదగిరీశ్వరరావు అన్నారు. డి.యర్రవరం, యరకంపేట, నాతవరం గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండలు తగ్గే వరకూ ఉపాధి కూలీలకు తాగునీటి సదుపాయం కల్పించడంతో పాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేస్తామని చెప్పారు. కూలీలు పనులు చేసేటప్పుడు ఉపాధి హామీ పథకం సిబ్బందితో పాటు సచివాలయ వైద్య సిబ్బంది పర్యవేక్షణ ఉండాలన్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో పని చేస్తుండగా శృంగవరంలో గురువారం పాము కాటుకు గురైన నేతల చెల్లయ్యకు మెరుగైన వైద్యసేవలందిస్తున్నట్టు చెప్పారు. ఈకార్యక్రమంలో ఏపీవో చిన్నారావు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు బీమాపై అవగాహన

నాతవరం: స్టేట్ బ్యాంకులో అకౌంటు ఉన్న ప్రతి వినియోగదారుడు ఇన్సూరెన్స్ చేయించుకుంటే కుటుంబానికి ఆర్థిక భరోసా ఉంటుందని తాండవ జంక్షన్ స్టేట్ బ్యాంకు మేనేజరు చైతన్యకుమార్ అన్నారు. మండలంలో శుక్రవారం పలు గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కూలీలకు బీమాపై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో ఎస్‌బీఐ అధికారి జగదీష్, ఉపాధి హామీ పథకం ఏపీవో చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు



శృంగవరంలో స్పీడ్ బ్రేకర్‌కు పెయింట్ వేస్తున్న సిబ్బంది

నాతవరం: మండలంలోని శృంగవరంలో రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టినట్టు సర్పంచ్ ఉలబాల యర్రయ్యమ్మ, వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ సభ్యులు శ్రీను తెలిపారు. ఆర్‌అండ్‌బీ రోడ్డుపై శుక్రవారం స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసి పెయింట్ వేసినట్టు వారు చెప్పారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో పలువురు మరణించారని, పోలీసులు, ఆర్‌అండ్‌బీ అధికారులు సూచనల మేరకు గ్రామంలో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశామన్నారు. వెర్రిగెడ్డపై నిర్మించిన వంతెన వద్ద ఇనుప బారికేడ్లు ఏర్పాటు చేశామన్నారు.

వర్షంతో ఉపశమనం

చోడవరం: ఎండలు మండుతున్న వేళ శుక్రవారం కురిసిన వర్షం మండలవాసులకు ఉపశమనం కలిగించింది. వారం రోజులుగా 40డిగ్రీలకు తగ్గకుండా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. శుక్రవారం చోడవరంలో 43డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం చల్లబడి ఓ మోస్తరు వర్షం కురిసింది. దీంతో మండలవాసులు ఉపశమనం పొందారు.